ఓం

# ప్రబోధ 1

02-01-87-01

సత్యధర్మప్రేమ శాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్య ధర్మప్రేమ శాంతులు లేకున్న
దానధర్మాలు సార్థకత సున్న
సత్యధర్మప్రేమ శాంతులు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్య ధర్మప్రేమ శాంతులు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మ మార్గంబు నిలువ
సుగుణములివి నాల్గు పునాది గోడలప్పు
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధుసద్గుణా సభ్యులౌ సాధులార.

దివ్యాత్మస్వరూపులైన సాధువులారా! ప్రేమస్వరూపులైన భక్తులారా!

సకలవేదవిజ్ఞానసారమే సనాతన ధర్మము. భారతీయ తత్త్వజ్ఞానమునకు, ధార్మికసిద్ధాంతమునకు, సంస్కృతీసాంప్రదాయములకు యీసనాతనధర్మమే మూలము. తెలుసుకొనవలసిన విషయము తెలుసుకొనునంత వరకు, వదలవలసినటువంటి బాధ్యతలు వదలనంత వరకు, చేరవలసిన గమ్యము చేరనంత వరకు యీయొక్క జీవితము నిర్విరామముతో చేరివుంటుంది.

వదలవలసిన దానిని వదలినంత
తెలియవలసిన దానిని తెలిసినంత
చేరవలసిన దానిని చేరినంత
కలుగు ఆనందమిదియని తెలుపవశమె.

వదలవలసినది యీ జగత్ భావములను
తెలియవలసినదే జీవ దివ్యతత్త్వము
అరుగవలసినదే బ్రహ్మపద చరణము
కలుగు ఆనందమిదియని తెలుపు తరమా.

నిర్వేదముతో కూడినటువంటి యీ జీవితమునకు, పవిత్రతత్త్వము బోధపడినంత మాత్రము చేతనే వేదముగా మారి దివ్యత్వము పవిత్రముతో వృద్ధివిస్తుంది. అదియే వేదము. వేదమనగా తెలివి,

మెరుక, వివేకము అనిచెప్పవచ్చును. తనవునికిని తాను గుర్తించి, అండదండలుగా వుండినటువంటి చరాచరప్రపంచమునకు తనకు వుండినటువంటి సంబంధ బాంధవ్యమును గుర్తించి వర్తించుట, వేదవాఙ్మయము అందించినటువంటి ప్రసాదమే. ఇదియే వివేకము. ఇదియే విజ్ఞానము. జ్ఞానము అనంతము. సత్యమును చూపునదే జ్ఞానము. భూతభవిష్యత్ వర్తమానకాలములకు అతీతమైనటువంటిదే సత్యము. సత్యజ్ఞానములు రెండు కూడను అనంతములు. అంతములేని వీటికి ఆది కూడను లేదనియు చెప్పవచ్చును. ఆద్యంతరహితమైన సత్యజ్ఞానములతో ముడిపడినటువంటిదే వేదము. వేదము కూడను ఆద్యంతరహితమైనదే. ఇట్టి జ్ఞానమయమైనటువంటి వేదమును వాఙ్మయముగా భావించటమే మానవత్వము యీనాటికి కూడను తరించలేకపోవుచున్నది. ఇది ఆచరణనిమిత్తమైనటువంటిదే కానీ ఆరాధననిమిత్తమైనటువంటిది కాదు.

కనుకనే అనాదికాలమునుండి భారతదేశమందు మహర్షులు యీసత్యమును గుర్తించి వర్తించటంచేతనే యీనాటికి కూడను యీపవిత్రత యీవిధముగా జగత్ వ్యాప్తిగా వించుచూ వస్తున్నది. ఈమహర్షుల యొక్క పలుకులే, వాక్యములే మంత్రములుగా మారినవి. వారు ఆచరించినటువంటి కర్మలే క్రతువులుగా మారినవి. ఆనాడు వారు ప్రార్థించినటువంటి ప్రార్థనలే గానముగా రూపొందినవి. ఏతావాతా వాక్కే ఋగ్వేదమనియు, మనస్సే యజుర్వేదమనియు, ప్రాణమే సామవేదమనియు నిరూపించవచ్చును. సర్వమ్ వేదమయం జగత్. ప్రపంచమునందలి ప్రతి అణువునందును, ప్రతి కణమునందును ప్రచ్ఛన్నముగా వ్యాపించినటువంటి పరతత్త్వమును చిన్నచిన్న మాటలలో విడివిడిగా వివరించినటువంటిదే వేదము. ప్రపంచములో మానవజాతి అభ్యుదయమునకు, శ్రేయస్సుకు, ప్రేయస్సుకు అర్హమైనటువంటి యొక్క మంత్రచర్యలను పరింపజేసి అందించి, ఆనందించి అభివృద్ధిగావించినటువంటిది కూడను వేదమే.

దేహము ద్వైతము. ఆత్మ అద్వైతము. దేహబుద్ధి క్షీణించినప్పుడే ఆత్మదీప్తి రాణిస్తుంది. దేహమునకు ఏకరణ సహజము. ఆత్మకు అనుగ్రహణ నైజము. ఉపాధి వుపశమించినంతనే సమాధి మనకు ప్రాప్తిస్తుంది. సమాధి ప్రాప్తించినప్పుడే మనకు పరతత్త్వము బోధపడుతుంది. ఈసమాధియే సాధకుని పరమావధి. కొంతకాలము తనది అని విశ్వసించినటువంటి తనువు తనదికాదనేటువంటి వివేకము యేనాడు గుర్తించునో ఆనాడే పరతత్త్వములో ప్రవేశిస్తుంది. కర్మకు పరమావధి జ్ఞానము. జ్ఞానమునకు ఆధారము కర్మ. కర్మజ్ఞానముల యొక్క సమన్వయమే సేవ. కనుకనే చిత్తస్యశుద్ధయే కర్మః. కర్మాచరణ చేతనే చిత్తశుద్ధి మనకు ప్రాప్తిస్తుంది. చిత్తశుద్ధి వలననే ఆత్మానందము లభిస్తుంది. ప్రతి మానవుడు చేయవలసినటువంటి కర్మలు విధిగా చేయకతప్పదు. మంచి మనస్సుతో మంచి కార్యములు ఆచరించవలసివస్తుంది. అయితే యీ ఫలము నా కర్మలద్వారానే ఫలించినదనేటువంటి అభిమానము మంచిది కాదు. నేను చేసిన కర్మయొక్క ఫలితము నేనే అనుభవించాలనేటువంటి ఆసక్తి కూడను తగినటువంటిది కాదు. ఆచరణయందు అహంకారము ఆసక్తియందు అభిమానము వీడినప్పుడే త్యాగము, భోగము రెండు ఒక్కటిగానే రూపొందుతాయి.

కనుకనే గీతాచార్యుడు కూడను కర్మలోని అకర్మను, అకర్మలోని కర్మను దర్శించినటువంటి వాడే యోగి.
అని నిరూపించాడు. ఐదవ అధ్యాయములో కర్మసన్న్యాసమనేటువంటి విషయమునందు కర్మను త్యజిం
టము కాదు ప్రధానమనియు, ఆచరించినటువంటి కర్మల ఫలితమును త్యజించుటము ప్రధానమనియు
బోధించటము. కర్మలనగా కేవలము భౌతికముగా మనము ఆచరించేటువంటి క్రియలనే కర్మలుగా
భావిస్తున్నాము. కానీ గీతాచార్యుని భావము అట్టిది కాదు. వారివారి దేహములే కర్మ. కనుక సన్న్యాసిగాని,
సంసారిగాని దేహమును ధరించినప్పుడు కర్మతో కూడి వస్తున్నాడు. కనుక కర్మస్వరూపమైన దేహస్వరూ
పమునందు ఆత్మను దర్శించటము, ఆత్మయందు సర్వభూతములను దర్శించటము ఇదియే అకర్మ
లోని కర్మ. కర్మలోని అకర్మ. కనుక జగత్తులోని భోగభాగ్యములు యే కొందరి నిమిత్తమో యేర్పడినటువంటివి
కాదు. ప్రతి మానవునకు తన యొక్క బాధ్యతగా అనుసరించవలసినటువంటి కర్మలు యనేకము ఉన్నవి.
బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్తము, సన్న్యాసము ఈయా స్థానములకు, ఈయా భావములకు అనుగుణ
ముగా నడచుకోవలసినటువంటి కర్మలు అనేకముగా వున్నవి.

తమ యొక్క స్థితికి, మతికి, గతికి, సద్గతికి చేయవలసినటువంటి కర్మలు
అనేకముగా వున్నాయి. ఇందులో ప్రధానమైనటువంటిది దైవశాసనము. ఈ శాసనము చేతనే వర్షములు
కురియుచున్నవి. వంకలు ప్రవహించుచున్నవి. పంటలు పండుచున్నవి. సూర్యుడు ప్రకాశించుచు
న్నాడు. చంద్రుడు ఉదయిస్తున్నాడు. ఇవన్నియు అందరి నిమిత్తమై యేర్పడినటువంటివేగాని కేవల
ము యే కొద్దిమంది మాత్రము నిమిత్తమై యేర్పడినటువంటివి కాదు. పార్థివ భోగాన్ని, భాగ్యాన్ని ప్రతి
ప్రాణి కూడను అనుభవించుటకు అధికారమున్నది. అయితే యిందులో స్వపర అనేటువంటి భేద
ములు విసర్జించి, సర్వత్ర దైవత్వాన్ని విశ్వసించి, అనిత్య, అశాశ్వత, అసత్యమైనటువంటి జగత్ భావ
ములు విస్మరించి యేకాత్మ భావమును అనుభవించటమే ప్రధానమైనటువంటి సత్యమార్గము.
తమ నిమిత్తమై తాము ఆచరించేటువంటి కర్మలు కేవలము కర్మజీవి ఆచరించునవి.

లోక కళ్యాణ నిమిత్తమై ఆచరించు కర్మలు జ్ఞానికి సంబంధించినటువంటివి.
జ్ఞానాజ్ఞానము యొక్క సమన్వయమును మనము గుర్తించటానికి చక్కగా ప్రయత్నము చేయాలి. దేహా
భిమానమును త్యజించి, ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకొని, అహంకారమును నిర్మూలము
గావించటమే నిజమైన త్యాగము. ఇది సన్న్యాసికి గాని, సంసారికి గాని సహజమైనటువంటిది.
కనుక ఇట్టి పవిత్రమైనటువంటి చరిత్రలు మనము ఈనాడు ఆవిర్భవింప చేసుకోవాలి.
ఇందులో వుండినటువంటి తత్త్వజ్ఞానాన్ని మనము అర్థము చేసుకోవాలి. ఒక విత్తనమును
మనము భూమిలో నాటుతాము. అది మొక్కగా అభివృద్ధిగాంచి, అది వృక్షముగా తయారై, అందు
లో వున్నటువంటి కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు మనకు వివిధ నామరూపము
లుగా గోచరించినప్పటికి, ఇవి అన్ని కూడను ఒక్క విత్తనమునుండి ఆవిర్భవించినవి. ఇదే
సత్యము. ఇదే నియమము. ఇదే ఆత్మ. ఇదే తత్త్వమసి.

ఒక నది ప్రవహించి అది సముద్రములో చేరుతుంది. సముద్రములోని జలము

ను ఆవిరిగా మార్చుకొని మేఘములుగా రూపొందుతుంది. మేఘముల నుండి వర్ష బిందువులు రాలుతాయి. ఈ వర్షములే వంకలుగా రూపొందుతాయి. ఈ వంకల యొక్క చేరికనే ప్రవాహముగా మారుతుంది. అయితే యీ ప్రవాహమునకు యీ జలము తనది అని తెలియదు. నదిలోని జలము, మేఘములోని జలము, వర్షములోని జలము ప్రవాహములోని జలము, నదిలోని జలము అంతయు ఒక జలమయమే. ఇదియే సత్యము. ఇదియే నియమము. ఇదియే ఆత్మ. ఇదియే తత్త్వమసి.

కొన్ని నిత్యజీవితములో అనుభవించేటువంటి ఆదర్శములు. కొంత లవణము తీసుకొని జలములో వేస్తాము. కొంత సేపటికి ఆ లవణము జలములో సర్వత్ర వ్యాపించిపోతుంది. కానీ యీ లవణము సర్వత్ర వ్యాపించినప్పటికి కంటికి కనుపించదు చేతికి చిక్కదు. కానీ లేదని చెప్పుటకు వీలు కాదు. దానిని జిహ్వయందు వేసుకున్నప్పుడే దాని రుచి మనకు గోచరమవుతుంది. సర్వత్రవ్యాపించినదే అయినప్పటికి, కంటికి కనుపించక చేతికి చిక్కకుండా వున్నంత మాత్రమున లేదని భావించరాదు. ఈ సర్వత్ర వ్యాపించినటువంటి రుచియే నీవు. అదియే ఆత్మ. అదే సత్యము. అదే తత్త్వమసి.

జాగ్రదవస్థయందు మానవుడు యనేక విధములైనటువంటి అనుభూతులను అనుభవిస్తాడు. అనేక విధముల సంబంధ బాంధవ్యములు కల్పించుకుంటాడు. సుఖ దుఃఖములను, గౌరవ మర్యాదలను అందుకుంటాడు కానీ స్వప్నావస్థయందు యివన్నీ శూన్యములవుతాయి. ఈ స్వప్నమునందు తనను తానే సృష్టించుకుంటాడు. తన సుఖదుఃఖములను కూడను తానే సృష్టించుకుంటాడు. తన భయభ్రాంతులను తానే సృష్టించుకుంటాడు. తన శత్రుమిత్రులను కూడను తానే సృష్టించుకుంటాడు. తానే సృష్టించుకొని, తానే అనుభవత్వము పొంది తానే యీ భయభ్రాంతులకు గురి అవుతాడు. సుషుప్తి స్థితియందు తాను ఆత్మలో లీనమై అనంతమైనటువంటి తత్త్వాన్ని అనుభవిస్తాడు. అయితే జాగ్రత యందు అనుభవించినటువంటివాడూ తానే, స్వప్నావస్థయందు అనుభవించినటువంటివాడు తానే. సుషుప్తియందు ఆనందాన్ని అనుభవించినదీ తానే. ఇతనే త్రిగూటుస్థితి యందు వుంటూ వుంటాడు. ఇదియే సత్యము. ఇదియే నీవు. ఇదియే ఆత్మ. ఇదియే తత్త్వమసి.

కనుక సర్వత్రా వ్యాపించినటువంటి శక్తి సామర్థ్యములను మనము గుర్తించి వర్తించుకోటానికి ప్రయత్నము చేయుటవే సరియైన సాధనము. మనము అందాన్ని చూచి ఆనందిస్తాము. ఆహారాన్ని చూచి ఆహ్లాదిస్తాము. పరిమళాన్ని చూచి పరవశిస్తాము. ఇవన్నియును దేహము చేయుచున్నదా ఆత్మ చేయుచున్నదా? ఇవన్నీ ఆత్మకు సంబంధించినవే కానీ దేహమునకు సంబంధించినటువంటివి కాదు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడనా

దేహియె దేవదేవుడు మదిన్ గమనింపగ నాత్మరూపుడై.

ఇలాంటి ఆత్మతత్త్వాన్ని మనము అన్వేషణ జరపాలి. దీనిని అనుభవించాలి. ఆనందించాలి. పెంచాలి. పదిమందికి పంచాలి. అదే యీనాడు చేయవలసినటువంటి ప్రధాన కర్తవ్యము. కనుక యిట్టి ఆత్మతత్త్వాన్ని అనుభవించి, ఆనందించి, యితరులకు అందించటానికి నిమిత్తమై యేర్పడినటువంటివే యీ ఆశ్రమాలు.

ఈ సాధు సమాజము యీ నిమిత్తమై యేర్పడినటువంటిదనేటువంటి సత్యాన్ని మనము యేనాటికిని విస్మరించరాదు. దీనిని మనము ఆధారము చేసుకునియే మన జీవితాన్ని అంకితము గావించి స్వార్థమును త్యజించి, పరార్థమును వరించి జీవితాన్ని తరింపచేసుకోటమే సాధకత్వములోవున్నటువంటి యదార్థము.

వ్యక్తి మోక్షమును కోరుట స్వార్థమగును
తాను గమ్యమును చేరుట ధర్మమగునా.
పరుల గమ్యము గోరుటే పాటి యగును
యిట్టి మనుజుడే నిజమైన మానవుండు.

తనకుతాను తరించుకోటం గొప్పతనము కాదు. పరులను కూడను తరింపచేయుటానికి తగిన పాటుపడాలి. ఇలాంటి విశాలమైన హృదయాన్ని మనము యీనాడు అభివృద్ధి గావించుకోవాలి. ఇలాంటి దివ్యతత్త్వాన్ని మనము యీనాడు అనుభవించుటకు పవిత్రమైన భారతదేశమందు యనేకమైన ఆదర్శములున్నవి.

కానీ వాటిని గుర్తించుటకు తగిన ప్రయత్నము చేయటంలేదు. సంకుచితమైన భావములచే స్వార్థమునే పరార్థముగా భావిస్తున్నాము. అనేకమంది భారతీయులు భారతదేశమందు అనేక విధములైనటువంటి ఆదర్శములనందించినటువంటివారు కలరు. ఖండఖండములంతకూడ ఖ్యాతిగాంచినటువంటి భారతదేశము యొక్క విశిష్టత మనము యీనాడు తిరిగి ఆవిర్భవింపచేసి ప్రచార ప్రబోధలు చేయాలి.

ఖండ ఖండాంతర ఖ్యాతినార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గొన్న సమరభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళల తోడ చిత్రమై వున్నట్టి
భరత భూమి యందు జననమంది
భరత భూమి ధర్మ భాగ్యంబు కాపాడ

భాగ్యవంతయు మీదె భక్తులారా.

ఇలాంటి పవిత్రమైన భారతదేశమందు మనకు జన్మము లభించుటము మహాభాగ్యము. అందులో మహనీయులుగా ఉద్భవించుటము మరింత భాగ్యము. అట్టి మహనీయులు పరోపకారార్థమై తమ యొక్క జీవితమును అంకితము చేసినటువంటివారు మరింత మహాభాగ్యవంతులు. ఇలాంటి పవిత్రమైన అవకాశము మనకు లభించినప్పుడు దీనిని సార్థకము చేసుకొని మనయొక్క దివ్యమైనటువంటి భారతదేశ సంస్కృతిని, ధర్మమును యీప్రపంచమునకు చాటుటము యీనాడు అత్యవసరము. మనభారతదేశముయొక్క విశిష్టతను చక్కగా గుర్తించి, యితరులకు బోధించి, దానిని చక్కగా వివరింపచేయుటము యీనాటి సాధువులయొక్క కర్తవ్యము.

పరమపావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటియందు వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠినతపము.

ఇలాంటి పవిత్రమైన తపస్సు మనము ఆచరించాలి. మాతృభావము కంటె మనకు ప్రధానమైనటువంటి మార్గము మరొకటి లేదు. ఇదియే శాంతము. ఇలాంటి శాంతభావముతో, సత్యవాక్కుతో, దైవచింతనతో మనము, ఆచరించి, అనుభవించి, సమాజమునకు అందించేటువంటిదే మనయొక్క ప్రధానకర్తవ్యము. ఇలాంటి దివ్యత్వమైన, పవిత్రమైన, మానవత్వము మనకు ప్రాప్తించినప్పటికిని మనము దీనిని సరియైనటువంటి రీతిగా అర్థము చేసుకొనలేక పోవటము కేవలము ఒక దురదృష్టమే.

ఈ అశాంతితో కుమిలి, కృశించి, కూలిపోయేటువంటి యీనాటి పరిస్థితియందు యీనాటి సాధువులందరు కంకణము కట్టుకొని సమాజములో ప్రవేశించి దేశమునకు త్యాగము చేసి తనయొక్క దివ్యత్వాన్ని తగినటువంటి రీతిలో ప్రజలకు అందించాలి. వాడవాడ వీధివీధి మనము సంచరించి యీసత్యప్రచారమును మనము ఆచరించాలి. జంతూనాం నరజన్మ దుర్లభః. ఈనరజన్మయెత్తినందుకు యీమహత్కార్యాన్ని మనము సాధించాలి. ఈపవిత్రమైనటువంటి కార్యము ఆరంభము కావటమే యీసమావేశముయొక్క ప్రధానలక్ష్యము. మనము అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, నిందలకు, నిష్ఠూరములకు మనము యెదుర్కొనటుకు సంసిద్ధముగావుండాలి. ఎన్నింటికైనా మనము సరియైనటువంటి ధైర్యసాహసములచేత దైవముపైన విశ్వాసము అభివృద్ధి పరచుకొని యీకార్యములో మనము అడుగిడాలి. మనము పూర్వాచారములన్నింటిని ప్రధానమైనటువంటి లక్ష్యమునందు వుంచుకోవాలి. దేశకాల పరిస్థితుల ప్రభావమననుసరించి కొన్నివిధములైనటువంటి మార్పులుకూర్పులు కూడను చేసుకోవాలి. ఈ మూడు దినములలోపల మనము అనేకరకములైనటువంటి విశిష్టతకల్పించేటువంటి విచారాన్ని విషయాన్ని అభివృద్ధిపరచుకోవాలి. తుదిదినము దీనికి

సరియైనటువంటి రూపాన్ని మనము రూపొందింప చేసుకోవాలి. ఏదో మన ఆచారములు, ఆచారములు అని చెప్పి కేవలము యీ మూఢాచారములందే మనము విచారించరాదు.

పవిత్రమైనటువంటి భగవద్గీత, ఉపనిషత్తు, బ్రహ్మసూత్రాది గ్రంథములయొక్క విషయాన్ని సరియైనటువంటి మార్గములో మనము ప్రజలకు అందించాలి. ఇందు మహా అఖండమైనటువంటి ఆధ్యాత్మిక తత్వము యిమిడి వున్నది. ఇట్టి విలువైన, బలమైనటువంటి తత్వాలను మనము యీనాడు ప్రచార ప్రబోధలచేత కొంచెము బలహీనము గావించుచున్నాము. ఈ అఖండ జ్యోతిని మనము వెలిగించి అనంతమైన ఆనందమును సమాజమునకు అందించాలి. ఆస్తిక, నాస్తిక, యాస్తిక, ఆస్తిక నాస్తిక తత్వాన్ని కూడను మనము రూపుమాపి సరియైనటువంటి స్థితి యేర్పరచాలి. యోగి, భోగి, బైరాగి, విరాగి యొక్క తత్వాన్ని ప్రపంచములో ప్రజలకు యీనాడు బోధించాలి. ఈనాడు సమాజ తత్వాన్ని, సాధు తత్వాన్ని గుర్తించనటువంటి వ్యక్తులు అనేక విధములైనటువంటి హాస్యాస్పదమునకు గురి చేస్తున్నారు. మన యొక్క సత్ప్రవర్తనలు వారికి నిరూపించాలి. దివ్యమైనటువంటి సాధనా ప్రతిష్ఠలను యీ ప్రజలలో ప్రతిష్ఠించాలి. శిలలను కూడను కరగింపచేసేటువంటి దయా ప్రేమలను మనము వెదజల్లాలి. సంకుచితమైన భావములను నిర్మూలము చెయ్యాలి. విశాలమైనటువంటి ఆత్మ తత్వాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. ఇదే నిజమైనటువంటి తపస్సు. ఇదే నిజమైన సాధన. కేవలము జపము, ధ్యానము యోగము యిత్యాది స్వార్థ క్రియలు ఆచరించుకుంటూ కాలము అపవిత్రము చేయుటము మన కర్తవ్యము కాదు. ఇది కాలమును పవిత్రము చేయు సత్కార్మలు మాత్రమే. కనుకనే నకర్మణా నప్రజయా త్యాగేనైకేన అమృతత్వమానసు. ఈ త్యాగానికి మనము యోగాన్ని పూసాలి. త్యాగమునందే యోగము యిమిడి వుంది. ఈ ఆత్మ యోగమే నిజమైనటువంటి భాగము.

లోకములో ధనవంతులు కలరు. బలవంతులు కలరు. విద్యావంతులు కలరు. గుణవంతులు కలరు. కానీ ఆత్మవంతులు అరుదుగా వుంటున్నారు. ఆత్మ తత్వాన్ని గుర్తించి, ఆత్మానందమును అనుభవించినటువంటి వాడే నిజమైన ఆత్మవంతుడు. ఈ అనేకత్వములోని యేకత్వమును మనము ప్రచారము చెయ్యాలి. జాతి మత కుల వర్ణ భేదములకు యే మాత్రము మనము కట్టుబడరాదు. సర్వమతముల సారమే మన యొక్క అభిమతముగా విశ్వసించాలి. అదియే మన నిజమైన మతము. అదియే యీ సాధువుల యొక్క వ్రతము. ఇదియే నిజమైనటువంటి తపము. కనుక యెట్టి రాజకీయములకు మనము అవకాశము నందివ్వక, యెట్టి జాతి, మత వర్ణములకు మనము అవకాశమునివ్వక సర్వసంగ పరిత్యాగులైనటువంటి సాధువులు కనుక సమత్వాన్ని, దివ్యత్వాన్ని, పవిత్రతను ప్రచారము చేస్తూ రావాలి. దీనిని యెవ్వరు కాదనలేరు. కాదనుటకు వీలు కాదు. ఇలాంటి విశాలమైనటువంటి భావములు యీ సమావేశములో యీ మూడు దినములలో చక్కగా మూర్తి ఆకారముగా మనము ధరించి యీనాటి నుండి మనము సమాజములో వాడవాడలు తిరిగి తగినటువంటి, ప్రజలలో వుండేటువంటి అశాంతిని రూపు

మాపిశాంతి భద్రతలను యేర్పరచాలని నేను ఆశిస్తున్నాను.

కానీ దీనికి తగినటువంటి అనుకూలములు లేక పోవటంచేతనే అనేక మందిసాధువులు నిరాశ నిస్పృహాచే నిరంతరము తాపత్రయపడుతున్నారు. దైవబలమే నిజబలము. ఇట్టి దైవవిశ్వాసమును నిజముగా విశ్వసించుకొని తద్వారా యీసమాజములో ప్రవేశించాలి. సత్యానికి భయము లేదు. ధర్మానికి నాశము లేదు. ప్రేమ ప్రతిఫలము ఆశించదు. ఈఫలితమాశించనటువంటి ప్రేమతో, భయము చెందనటువంటి సత్యముతో, దిగులొందనటువంటి ధర్మముతో యీ ధరణిలో మనము ప్రవేశించాలి. అప్పుడే మనము దిగ్విజయాన్ని సాధించగలము. దీనికి యేవిధమైనటువంటి ఆటంకములు కలుగవు. అలాంటి విశ్వాసమే మనశ్వాసముగా విశ్వసించాలి. సన్యాసమనగా సర్వసంగ పరిత్యాగము చేసినామనుకుంటున్నాము. కాదు. సర్వసంఘాన్నిమనము బహిష్కరించరాదు. సంఘములోనే మనము ప్రవేశించాలి. ఈ అహంకారమును నిర్మూలము చేసుకోవాలి. అభిమాన మమకారములు దూరము చెయ్యాలి. సంఘములో చేరాలి. సంఘములో చేరక సాధువులు కేవలము తైలములో నీటి బొట్టువలె యేకాకిగా వుండుటకు వీలుకాదు. మనము మంచికార్యములందే మనము పాల్గొనిన యెంతవరకునైనా తగిన సహాయము తమంతట తమే యేర్పడతాయి. కనుక మనకు కావలసిన అనుకూలనిమిత్తమై మనము విచారించనక్కరలేదు. దైవమే మనపెన్నిధి సన్నిధిగా వుంటున్నప్పుడు మనము యీవిధమైన అనుకూలములనిమిత్తమై యెందుకు అనవసరంగా యోచించాలి.

కోరిన ఫలమిచ్చు కామధేనువు వుండ
ధనమిచ్చి ఆవును కొనగనేల.
అడిగిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి వృక్షమునకై ప్రతియేల.

కనుక దైవమే మన కామధేనువు. దైవమే మన కల్పవృక్షము అనేటువంటి విశ్వాసాన్ని మనము ధృఢము చేసుకోవాలి. అట్టివిశ్వాసము కలిగినటువంటివారికి యేనాటికి అశాంతిగానీ, అనానుకూలముగానీ సంభవించదు.

మంచికి కొంత చెడ్డ అడ్డు తగులుతూ వుంటుంది. ఇది ప్రాకృతము యొక్క పరిస్థితి. దీనియొక్క నైజము. కాచిన చెట్టుకే రాళ్ళదెబ్బలు. నేను అప్పుడప్పుడు అందరినీకూడను బంగారు, బంగారు అని పిలుస్తుంటాను. బంగారు అనగా చాలా విలువైనటువంటిది. కానీ యిది నగగా తయారు చెయ్యాలంటే కష్టములను, నష్టములను, దుఃఖములను గురికావలసి వస్తుంది. అగ్నిలో వేసి సుత్తితో కొట్టి యిన్నిరకములైనటువంటి శిక్షలు అనుభవించిన తరువాతనే యిది ఒక చక్కని నగగా తయారవుతుంది. కనుక అందరూ విలువైనటువంటి జీవులే అందరూ భగవంతుని బిడ్డలే. ఈయొక్క నిప్పులోని కణములలోపల నిప్పుయొక్క గుణములు యేరీతిగా వుంటున్నాయో అదే రీతిగనే దైవముయొక్క బిడ్డలైనటువంటి మానవుల

యందు కూడను దైవగుణములు సమస్తము వుంటున్నవి. కనుక దైవబిడ్డలైనటువంటి మానవులు కూడను సచ్చిదానందస్వరూపులే. అట్టి విశ్వాసమును మనము ధృఢముగా పెట్టుకోవాలి. ఈ ధృఢ విశ్వాసము చేత కానటువంటి పనులు ఒక్కటి కూడను వుండవు. దేనినైనా సాధించవచ్చును. దానికి నేనే నిదర్శనము. ఎన్ని నిందలో, యెన్ని నిష్ఠూరములో, యెన్ని విధములైనటువంటి హాస్యాస్పదములో, యెన్ని విధములైనటువంటి ఆటంకములు వచ్చినప్పటికిని దానిని యెదుర్కొని, ధైర్య సాహసముల చేత చేసే కార్యములు సత్యరూపమైనటువంటివి కనుక యీ విధమైనటువంటివి సాధించుకోవటం చేతనే యిక్కడ నిలువ కలుగుతున్నాను. సాయికి వుండినటువంటి దూషణ భూషణ తిరస్కారములు యెవ్వరికిని వుండవు యీ లోకములో.

మనదికానటువంటి దానికై మనము యోచించనవసరము లేదు. మనలో లేని దోషములను యెవ్వరు యెన్ని విధములుగా పాటించినప్పటికిని మనము దానికి చింతించనక్కరలేదు. ఇది ప్రకృతి యొక్క నైజము. ద్వైతముతో కూడినటువంటిది. ఎండనీడలు ఒక దాని ప్రక్కన ఒకటి వుండినట్లుగా దూషణ భూషణలు రెండు ఒకదాని ప్రక్క ఒకటి జంటగా, వెంటగా వుంటున్నాయి. ఎండ వుండబట్టే ప్రక్కన నీడ యేర్పడుతున్నది. నీడలో కూడను యెండ వుంటున్నది. కనుక యీ రెండింటి యందు మనము సమత్వము వహించాలి. దివ్యత్వమును లక్ష్యము నందుంచుకోవాలి. పవిత్రమైన కార్యములలో ప్రవేశపెట్టాలి. యిదే మనము యీనాడు క్రొత్తగా ఆచరించవలసినటువంటి ప్రధానసాధన.

ప్రేమస్వరూపులారా! దైవము యొక్క తత్వము మీలో ఆవిర్భవించింది. కేవలము దైవాత్మనుండి ప్రపంచములో ప్రవేశించినామని భావించరాదు. లేక ప్రకృతినుండి ఆత్మలో ప్రవేశిస్తున్నామని కూడను మనము భావించరాదు. ఆత్మ ప్రవేశించునది కాదు. ప్రక్కకు పోవునది కాదు. సర్వత్ర వుండునటువంటిది. కనుక మన వెంటనే, జంటనే, యింటనే వుండి కంటిరెప్పవలె కాపాడుతూ వచ్చేటువంటిది. యీ ఆత్మతత్వము ఒక్కటే. ఈ ఆత్మకు రాకపోకలు లేనటువంటి స్థితి. దీనికి రాకపోకలు లేవు. సర్వసాక్షియైనటువంటి తత్వము యీ ఆత్మతత్వము. ఇది కేవలము వచనముల చేత అర్థమయ్యేది కాదు. ఆచరణ చేత అనుభూతి చేత మనము అందుకోవాలి. ఇలాంటి ఆత్మానందమును అందుకొని మీరు అనుభవించి దీనిని అభివృద్ధిగావించుకొని జగత్తునకు పంచుతారని నేను ఆశిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ఈ మూడు దినములలోపల, కాలానుగుణ్యమును అనుసరించి ప్రజలకు యే విధమైనటువంటి మార్గములో మనము సహకరించాలి, ఏ విధమైనటువంటి మార్గముతో మనము వారికి బోధించాలి; ప్రజలలో వుండినటువంటి సందేహములు యే విధముగా నివారణ చెయ్యాలి. ఆత్మతత్వమనేటువంటిది వారిలో నెలకొల్పాలి. దీనిని నాటిన తరువాత దీనిని యే విధముగా పోషించాలి అనేటువంటి విషయాలలో యీ మూడు దినములలోపల మనము చక్కగా

02-01-87-10

విచారించి కేవలము ప్రసంగాలతోనే మనము కాలము వ్యర్థము గావించక యీ శాశ్వతమైన సత్యమైన, నిత్యమైన తత్వాన్ని ప్రచారప్రబోధలు చేయుటానికి తగిన అవకాశములను, మార్గములను యీ యొక్క సమావేశములో మనము నిర్ణయము చేసుకోవాలని నేను ఆశిస్తున్నాను. మన ఆశయాలు దిగ్విజయాన్ని సాధించగలవు. దీనికి యేమాత్రము కూడను సందేహించనక్కరలేదు. బలహీనులు కారాదు. ఆత్మవిశ్వాసము చేతనే దీనిని సాధించటానికి ప్రయత్నించాలి. ఇంక ముందు కార్యక్రమములలో మీ సమావేశమునకు సంబంధించినటువంటి మహనీయులు అనేక రకములైనటువంటి ఆదర్శములను అందిస్తారు. ప్రబోధిస్తారు. ప్రబోధించి అందించటమే కాకుండా నూతనమైనటువంటి పద్ధతులు కూడను అభివృద్ధిగావించి మున్ముందు సమాజములోపల ఆవరించినటువంటి అశాంతిని మనము కొంతవరకు అరికట్టి ఆనందాన్ని అందించాలని నేను యెక్కువగా ఆశిస్తున్నాను.

పూర్ణచంద్ర
ప్రశాంతి నిలయం.